ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5

తమిళనాడు
TAMILNADU
శుక్రవారం 29 నవంబరు 2024



తప్పిన ముప్పు?!

- వాయుగుండం తుఫానుగా మారే అవకాశం లేదు
- వాతావరణశాఖ ప్రకటన
- చెన్నై సహా 5 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

చెన్నై, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి 'ఫెంగల్' గండం తప్పింది. బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం తుఫానుగా మారే అవకాశం లేదని వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈశాన్యం వైపు కదులుతున్న వాయుగుండం, శుక్రవారం ఉదయానికి ఉత్తర దిశగా పయనించి శనివారం ఉదయం బలహీనపడి, కారైక్కాల్-మహాబలిపురం మధ్య తీరం దాటుతుందని పేర్కొంది. ఈ వాయుగుండం, ఈశాన్య రుతుపవనాలు తీవ్రరూపం దాల్చటం వల్ల చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు, తిరువళ్లూరు, రాణిపేట జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముంది. అదే సమయంలో చెంగల్పట్టు, విల్లుపురం, కడలూరు, మైలాడుదురై, నాగపట్టినం, తిరువారూరు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో కొన్ని చోట్ల చెదురుమదురుగా, మరికొన్ని చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం వుంది. దీంతో విల్లుపురం, కడలూరు జిల్లాల్లో శుక్రవారం, పుదుచ్చేరి, కారైక్కాల్‌లో శుక్ర, శనివారాల్లో విద్యాలయాలకు సెలవు ప్రకటించారు. బుధవారం ఉదయం నైరుతి బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన తీవ్ర వాయుగుండం ఉత్తర వాయువ్య దిశగా కదులుతూ గురువారం ఉదయం 8.30 గంటలకు అదే ప్రాంతంలో నత్తనడకన కదలాడింది. ఈ వాయుగుండం శ్రీలంక- ట్రింకోమలై ప్రాంతాలకు తూర్పు, ఈశాన్య దిశల వైపు సుమారు 110 కిలోమీటర్ల దూరంలో, నాగపట్టినం నుంచి ఆగ్నేయంగా 310 కిలోమీటర్ల దూరంలోను, పుదుచ్చేరికి ఆగ్నేయంగా 410 కిలోమీటర్ల దూరంలోను, చెన్నై నుంచి దక్షిణ, ఆగ్నేయ దిశగా 480 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైంది. గురువారం రాత్రిలోగా ఆ వాయుగుండం శ్రీలంక తీరం వైపు కదులుతూ ఆ తర్వాత పుదుచ్చేరి వైపు తన దిశ మార్చుకుని తీరం దాటేందుకు ప్రయత్నించే అవకాశముంది.

అంచనాలు తారుమారు...

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుపానుగా మారుతుందని వాతావరణ పరిశోధన కేంద్రం జారీ చేసిన అంచనాలు తారుమారయ్యాయి. మంగళవారం సాయంత్రమే వాయుగుండం తుపానుగా మారుతుందని ప్రకటించారు. కానీ తుపానుగా మారలేదు. గురువారం రాత్రి వాయుగుండం తీవ్రరూపం దాల్చుతుందని ప్రకటించారు. అదే సమయంలో తుపానుగా మారటం ఆలస్యమవుతుందని అంచనా వేశారు. వాయుగుండం తుఫానుగా మారకపోయినా ఈ నెల 30న వాయుగుండంగానే తీరం దాటే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొన్నారు.



వాయుగుండం హెచ్చరికలతో రాయపురం ఫ్లైఓవర్ వద్ద కార్లను పార్కింగ్ చేసిన యజమానులు

మెరీనా తీరంలో పోలీసు పహారా..

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా సముద్రతీర ప్రాంతాల్లో అలల తాకిడి ఉధృతమైంది. నగరంలోని మెరీనాబీచ్, బీసెంట్‌నగర్ బీచ్, పట్టినంబాక్కం, శ్రీనివాసపురం సముద్రతీర ప్రాంతాల్లో తీరం వైపు గురువారం ఉదయం నుంచి అలలు ఎగసిపడుతున్నాయి. మూడు నుండి ఐదు మీటర్ల ఎత్తున అలలు తీరంవైపు ఎగసి పడుతుండటంతో మెరీనాబీచ్‌లో సముద్రం వైపు ఎవరూ వెళ్లకుండా పోలీసులు కాపలా కాస్తున్నారు. కాశిమేడు, బీసెంట్‌నగర్ బీచ్‌ల వద్ద కూడా పోలీసు పహారా ఏర్పాటైంది. మెరీనాబీచ్‌లో గురువారం ఉదయం నుంచి పోలీసులు లైట్ హౌస్ నుంచి అన్నాదురై సమాధి ప్రాంతం వరకు తీరం పొడవునా సందర్శకులను సముద్రం వైపు వెళ్లకుండా కట్టుదిట్టం చేస్తున్నారు.

ఏ కూటమిలో చేరితే 'మేలు'?

- చిన్నపార్టీల మంతనాలు!
- లాభనష్టాలు బేరీజు వేసుకుంటున్న నేతలు



చెన్నై, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా 15 నెలల సమయం ఉండగానే అప్పుడే తమిళనాట వేడి రాజుకుంది. అధికారాన్ని కాపాడుకోవాలని డీఎంకే.. ఈసారి ఎలాగైనా పీఠాన్ని దక్కించుకోవాలని అన్నాడీఎంకే గట్టిగా కసరత్తు చేస్తుండగా, మిగిలిన పార్టీలు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు మెదడుకు పదును పెడుతున్నాయి. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే, అన్నాడీఎంకే కూటములు ఖాయంగా కనిపిస్తుండగా, మూడో కూటమి వస్తుందా? లేక నాలుగో కూటమికి కూడా అవకాశముందా అన్నదానిపై ఇప్పటి నుంచే చర్చ మొదలైంది. అదే సమయంలో ఏ కూటమిలో చేరితే ఏ మేరకు మేలు జరుగుతుందన్నదానిపై రాష్ట్రంలోని చిన్నాచితకా పార్టీలన్నీ బేరీజు వేసుకుంటున్నాయి. ఏ కూటమిలో చేరితే తమకు ఆర్థికంగా, పార్టీ పరంగా ఏమేరకు లాభం అన్నదానిపై సీనియర్లు, రాజకీయ విశ్లేషకులతో చర్చిస్తున్నాయి.

ప్రస్తుతం డీఎంకే కూటమిలో కాంగ్రెస్, ఎండీఎంకే, సీపీఐ, సీపీఎం, వీసీకే, ఐయూఎంఎల్, కొంగునాడు మక్కల్ దేశీయ కట్చి, మణిదనేయ మక్కల్ కట్చి, అఖిల ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, తమిళగ వాల్వురిమై కట్చి, మక్కల్‌నీది మయ్యం తదితర పార్టీలున్నాయి. ఇక అన్నాడీఎంకే కూటమిలో చెప్పుకోదగిన పెద్ద పార్టీలేవీ లేవు. డీఎండీకే, అఖిల ఇండియా మూవేందర్ మున్నని కళగం వంటి చిన్నాచితకా పార్టీలు మాత్రమే మిగిలాయి. అదే సమయంలో బీజేపీ కూటమిలో పీఎంకే, తమిళ మానిల కాంగ్రెస్ మాత్రమే వున్నాయి. కానీ గత అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమిలోనే బీజేపీ, పీఎంకే, టీఎంసీ, అమ్మామక్కల్ మున్నేట్ర కళగం ఉండగా, ఆ తరువాత జరిగిన పరిణామాల్లో అవి విడిపోయాయి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కూటమి ప్రత్యేకంగా పోటీ చేసినా పెద్దగా ఫలితం లేకపోయింది. ఆ పార్టీని నమ్ముకున్న పీఎంకే, టీఎంసీ ఫలితాల ముందు బొక్కబోర్లా పడ్డాయి. దీంతో ఈ సారి అసెంబ్లీ ఎన్నికలపై ఆయా పార్టీలు ఏం చేస్తాయన్నది సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. దీనికి తోడు నటుడు విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) కొత్తగా తెరపైకి రావడం, ప్రజల నుంచి ఆ పార్టీకి అనూహ్య స్పందన వస్తుండడంతో దానిని మచ్చిక చేసుకునేందుకు అన్నాడీఎంకే, బీజేపీ పోటీ పడుతున్నాయి. అయితే ఆదిలోనే టీవీకే అధినేత విజయ్ బీజేపీపై విమర్శలు చేయడంతో కాషాయదళంతో ఆయన స్నేహం ఉండకపోవచ్చని తెలుస్తోంది.

చిన్న పార్టీల రాయ'బేరాలు'!

అమ్మ మక్కల్ మున్నేట్ర కళగం, దేశీయ ముర్పోక్కు ద్రావిడ కళగం, ఎస్‌డీపీఐ, ఏఐఎంఐఎం (మజ్లిస్), గోకుల మక్కల్ కట్చి, మరుదు సేనై సంఘం, విడుదలై తమిళగ పులిగళ్ కట్చి, మక్కల్ అరసు కట్చి, ఇండియా జననాయగ కట్చి (ఐజేకే), అఖిల ఇండియ సమత్తువ మక్కల్ కట్చి, తమిళగ మక్కల్ జననాయగ కట్చి, మత సారపట్ర జనతా కట్చి, జననాయగ ద్రావిడ మున్నేట్ర కళగం, నామ్ తమిళర్ కట్చి, పుదియ తమిళగం, బహుజన సమాజ్ పార్టీ వంటి పార్టీలు గత అసెంబ్లీ ఎన్నికల్లో వివిధ కూటములతో కలిసి పోటీ చేశాయి. అయితే ఈ సారి ఏ కూటమిలో చేరాలన్న దానిపై ఆలోచిస్తున్నాయి. వీటిల్లో కొన్ని పార్టీలు తమకు కనీసం ఒక్క స్థానం వచ్చినా చాలని భావిస్తున్నాయి. మరి కొన్ని పార్టీలైతే కూటమికి నేతృత్వం వహించే పార్టీ చిహ్నంపై పోటీ చేసేందుకైనా తాము సిద్ధమని, అయితే తమ పార్టీకి చెందిన నేతకు కూడా అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఆ మేరకు తమ ఆలోచనలను ఆమోదించే పార్టీల కోసం అన్వేషణ సాగిస్తున్నాయి. ఏ ఇద్దరు రాజకీయ నేతలు కలిసినా.. వారి మధ్య భవిష్యత్తు పొత్తుల గురించే చర్చ నడుస్తోంది.

కలిసుందాం రా!

ఈ సారి అసెంబ్లీ ఎన్నికల్లో తమతో చేతులు కలిపే సరిజోడి కోసం ఇప్పటి నుంచే అన్ని పార్టీలు ప్రయత్నాలు మొదలుపెట్టాయి. మరీ ముఖ్యంగా విజయ్ పార్టీతో చేతులు కలిపేందుకు అన్నాడీఎంకే అన్ని రకాలుగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు టీవీకే కూడా సుముఖత వ్యక్తం చేసినప్పటికీ, ఆ పార్టీ నుంచి వస్తున్న డిమాండ్లు అన్నాడీఎంకేను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల్లో భారీ ఫండింగ్‌తో పాటు తాము అడిగినన్ని సీట్లు, కోరిన స్థానాలు, ఉపముఖ్యమంత్రి పదవి వంటివి విజయ్ డిమాండ్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో అన్నాడీఎంకే అధినేత ఈపీఎస్ తల పట్టుకున్నారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇదే సమయంలో అన్నాడీఎంకేతో దోస్తీ కోసం బీజేపీ తహతహలాడుతోంది. ప్రభుత్వ వ్యతిరేకతతో పాటు తమ రెండు పార్టీల కలయిక అన్ని విధాలుగా కలిసొస్తుందని కాషాయదళం గట్టిగా తలపోస్తోంది. అందుకే ఈపీఎస్‌తో రాయబారాలు నడుపుతోంది. కానీ బీజేపీతో చేతులు కలిపితే మైనారిటీ ఓటు బ్యాంకు దెబ్బతింటుందని భావిస్తున్న ఈపీఎస్.. ఆ పార్టీతో స్నేహానికి వెనుకాడుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బీజేపీతో చేతులు కలిపే ప్రసక్తే లేదని ఆయన చెబుతున్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ పక్క చూపులు చూస్తోందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆ పార్టీ కేంద్ర అధిష్ఠానం ముఖ్యమంత్రి స్టాలిన్‌తో సన్నిహితంగా ఉన్నా.. రాష్ట్ర నేతలు మాత్రం డీఎంకేతో అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోంది. ఒంటరిగా ఎదగాలని తహతహలాడుతున్న కాంగ్రెస్ నేతలు.. ఆ మార్గమేదో తెలియక, ఏం చేయాలో దిక్కుతోచక.. ఈ సారి అన్నాడీఎంకేతో చేతులు కలిపితే ఎలా వుంటుందని యోచిస్తున్నారు. అయితే ఆ ఆలోచనను జాతీయ నాయకత్వం ఏ మేరకు ఆమోదిస్తుందోనన్నది సందేహమే.

విద్యా కాంతులతోనే మహిళా చైతన్యం

- త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి





కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు, విద్యార్థినులు - గవర్నర్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న నిర్వాహకులు

ప్యారీస్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే మహిళా చైతన్యం, మహిళా సాధికారత సాధ్యమవుతుందని త్రిపుర గవర్నర్ ఎస్.ఇంద్రసేనా రెడ్డి అభిప్రాయపడ్డారు. జార్జ్‌టౌన్‌లోని ఎస్‌కేపీడీ ఆధ్వర్యంలోని కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాలలో గురువారం నిర్వహించిన మహిళా సాధికారత కార్యక్రమానికి త్రిపుర గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రథమ చికిత్సపై శిక్షణ పొందిన విద్యార్థినులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, ఆ దిశగా, విద్యార్థినులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. విద్య ద్వారానే మహిళా చైతన్యం, మహిళల జీవనశైలి మెరుగు, మహిళా సాధికారత సాధ్యమవుతాయన్నారు. అన్ని వర్గాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులను ఉన్నతవంతులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ఎస్‌కేపీడీ యాజమాన్యం నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక విద్య, సామాజిక సేవలు అభినందనీయమన్నారు. ఎస్‌కేపీసీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎస్‌కేపీడీ చారిటీస్ ధర్మకర్త కొల్లా వెంకట చంద్రశేఖర్, ట్రస్టీలు ఊటుకూరు శరత్ కుమార్, సీఆర్ కిషోర్ బాబు, సోలేటి లోకయ్యాన్ సుదర్శనం, దేశు లక్ష్మీనారాయణ, టీవీ రామకుమార్, సీఆర్ కిషోర్ బాబు, టి.భద్రీనాథ్, సలహాదారుడు డాక్టర్ జేవీ రావు, కార్యదర్శి ఎం.కిషోర్ కుమార్ సహా ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన త్రిపుర గవర్నర్ ముందుగా ఎస్కేపీడీ ఆలయంలో కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఈవీకేఎస్ ఇళంగోవన్



కాంగ్రెస్ సీనియర్ నేత ఈవీకేఎస్‌కు అస్వస్థత

- పరామర్శించిన సీఎం స్టాలిన్

అడయార్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సీనియర్ నేత, ఈరోడ్ ఈస్ట్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఇళంగోవన్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.

దీంతో ఆయన్ని కుటుంబీకులు నందంబాక్కంలోని మియాట్ ఆస్పత్రిలో చేర్పించారు. ఈ విషయం తెలుసుకున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై తదితరులు గురువారం ఆస్పత్రికి వెళ్ళి, ఈవీకేఎస్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆయన అక్టోబరు 31 నుంచి జ్వరంతో బాధపడుతుండగా,.. వైద్యుల సూచన మేరకు ఇంతకాలం ఇంట్లోనే వుంటూ చికిత్స పొందుతున్నారు. అయితే ఆయన రెండు రోజుల క్రితం దగ్గు, జ్వరంతో ఊపిరాడక తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు మియాట్ ఆస్పత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు ఆస్పత్రి వర్గాలు తెలిపాయి.



ఇళంగోవన్ ఆరోగ్యం గురించి వైద్యులను అడిగి తెలుసుకుంటున్న ముఖ్యమంత్రి స్టాలిన్

నిఘా నీడలో పాఠశాలలు

- స్కూళ్ల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు
- జీసీసీ సమావేశంలో నిర్ణయం



సమావేశంలో మేయర్ ప్రియ, కమిషనర్ కుమారగురుబరన్, డిప్యూటీ మేయర్ మహేష్ కుమార్

చెన్నై, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 245 ప్రాథమిక, మహోన్నత పాఠశాలల వద్ద రూ.8 కోట్లతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ మేయర్ ఆర్.ప్రియ తెలిపారు. గురువారం రిప్పన్‌భవనం హాలు లో కార్పొరేషన్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మేయర్ మాట్లాడుతూ... నగరంలోని కార్పొరేషన్ పాఠశాలల్లో విద్యార్థుల భద్రత దృష్ట్యా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. నగరంలో శునకాల బెడద నివారించేందుకు వాటికి సంతాన నిరోధక టీకాలు వేస్తున్నామని, ఇటీవల జరిపిన గణాంకాల ప్రకారం నగరంలో 1.80లక్షల మేర శునకాలున్నాయని, వాటికి సంతాన నిరోధక టీకాలు వేయడానికి ఐదు కేంద్రాలుండగా, 3, 7, 11 జోన్లలో రూ.2.6కోట్లతో మరో మూడు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.


ఉదయనిధికి బీజేపీ కార్పొరేటర్ గ్రీటింగ్స్...

ఈ సమావేశం ప్రారంభానికి ముందు మీటింగ్ హాలు బయట బీజేపీ కార్పొరేటర్ ఉమా ఆనంద్ మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే ఘనవిజయం సాధించినందుకు కార్పొరేటర్లకు మిఠాయిలు పంచిపెట్టారు. అదే సమయంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి జన్మదినం సందర్భంగా డీఎంకే కార్పొరేటర్ చొక్కలింగం స్వీట్లు పంచుతూ అక్కడకు వచ్చారు. ఉమా ఆనంద్‌కు కూడా స్వీటు ఇవ్వగా, ఆమె ఉపముఖ్యమంత్రి ఉదయనిధికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఆస్తి పన్నుపై వినూత్న నిరసన

- ముసుగులేసుకుని వచ్చిన కార్పొరేటర్లు
- రసాభాసగా తిరుప్పూర్ కార్పొరేషన్ సమావేశం

ప్యారీస్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పన్ను పెంచుతూ ఇటీవల తిరుప్పూర్ కార్పొరేషన్ తీసుకున్న నిర్ణయాన్ని నిరశిస్తూ.. అక్కడి ప్రతిపక్ష కార్పొరేటర్లు వినూత్న నిరసన తెలిపారు. కార్పొరేషన్ సమావేశానికి ముసుగులేసుకుని వచ్చి, తమ ఆందోళన వ్యక్తం చేశారు. తిరుప్పూర్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం మేయర్ దినేష్‌కుమార్ అధ్యక్షతన సమావేశం జరిగింది. అన్నాడీఎంకే కౌన్సిల్ ప్రతిపక్ష నేత అన్భగం తిరుపతి నేతృత్వంలో సమావేశానికి హాజరైన కార్పొరేటర్లంతా, ముసుగులేసుకుని, నల్లబ్యాడ్జీలు ధరించి పెంచిన ఆస్తి పన్నును తగ్గించాలంటూ నినాదాలు చేశారు. సమావేశంలో తీర్మానాలు ఆమోదించిన తరువాత విపక్ష సభ్యులందరికీ మాట్లాడే అవకాశం కల్పిస్తామని మేయర్ చెప్పినా ఫలితం లేకపోయింది. ఒకేసారి విపక్ష సభ్యులంతా లేచినిలబడి మాట్లాడడంతో మేయర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అరుపులు, కేకల మధ్యనే తీర్మానాలన్నీ ఆమోదం పొందినట్లు ప్రకటించారు. దీంతో ఆగ్రహం చెందిన వామపక్ష కార్పొరేటర్లు సమావేశాన్ని బహిష్కరించి, రోడ్డుపై బైఠాయించారు.



మేయర్ పోడియం ముందు కూర్చున్న కార్పొరేటర్లు



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న కార్పొరేటర్లు

దీంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. రంగంలోకి దిగిన పోలీసులు.. పదిమంది మహిళా కార్పొరేటర్ల సహా 50 మందిని అరెస్టు చేసి, తరలించారు.

ఇన్ని రోజులు ఎందుకు నోరు మెదపలేదు?: మేయర్

విపక్ష సభ్యుల సమావేశ బహిష్కరణ అనంతరం మేయర్ మాట్లాడుతూ.. ఇన్ని రోజులుగా నోరు మెదపని విపక్ష సభ్యులు హఠాత్తుగా ఇలా నిరసన వ్యక్తం చేయడమేంటని ప్రశ్నించారు. తమ మిత్రపక్షంగా వున్న కాంగ్రెస్, వామపక్షాల సభ్యులు కూడా అన్నాడీఎంకేతో కలిసి నిరసన వ్యక్తం ఆశ్చర్యంగా వుందని వ్యాఖ్యానించారు.

సమాచార దర్శిని

జనవరి 4న గ్రూప్-4 ఇంటర్వ్యూలు

చెన్నై, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన పరీక్షల్లో ఎంపికైన గ్రూప్-4 అభ్యర్థులకు జనవరి 4వ తేదీ ఇంటర్వ్యూ జరుగనుంది. వివరాలిలా వున్నాయి... తమిళనాడులో గ్రూప్4 ఉద్యోగాల కోసం జూన్ 9వ తేదీ పరీక్ష జరిగింది. దీనికి 15,88,684 మంది హాజరయ్యారు. వాటి ఫలితాలు అక్టోబరు 28వ తేదీ విడుదలయ్యాయి. అనంతరం అర్హులైన అభ్యర్థుల మార్కుల జాబితా కూడా తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో గ్రూప్-4కు ఎంపికైన అభ్యర్థుల ఇంటర్వ్యూలు జనవరి 4వ తేదీ జరుగనున్నట్లు టీఎన్‌పీఎస్‌సీ ప్రకటించింది.

1న రాష్ట్రానికి అన్నామలై రాక

చెన్నై, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో 'ఇంటర్నేషనల్ పాలిటిక్స్'పై ప్రత్యేక కోర్సు చేసేందుకు వెళ్లిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై డిసెంబరు 1వ తేదీ రాష్ట్రానికి రానున్నారు. ఆగస్టు 28వ తేదీన ఇంగ్లాండ్ వెళ్లిన అన్నామలై.. ఈ నెల 30వ తేదీన ఇంగ్లాండ్‌లో బయలుదేరి.. మరునాడు చెన్నై చేరుకోనున్నారు. ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు పార్టీ కార్యకర్తలు ఏర్పాట్లు చేపడుతున్నారు.

నిబంధనలు సడలించండి

కోర్టులో నటి కస్తూరి పిటిషన్ దాఖలు

అడయార్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తనకు విధించిన బెయిల్ నిబంధనలు సడలించాలని సినీ నటి కస్తూరి కోరారు. ఈ మేరకు ఆమె గురువారం ఎగ్మోర్ కోర్టులో పిటిషన్ వేశారు. ఇటీవల నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆమె.. తెలుగు ప్రజలను కించపరిచేలా వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆమెపై కేసు నమోదుకాగా, ఆమెను నగర పోలీసులు హైదరాబాద్‌లో అరెస్టు చేసి నగరానికి తీసుకొచ్చి కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు. ఆ తర్వాత ఈ కేసులో ఆమెకు సైదాపేట మేజిస్ట్రేట్ కోర్టు బెయిల్ మంజూరు చేస్తూ, ఎగ్మోర్ పోలీస్ స్టేషన్‌కు రోజూ ఉదయం 10 గంటలకు వెళ్లి సంతకం చేయాలన్న షరతు విధించింది. ఈ నేపథ్యంలో ఈ నిబంధనలు తొలగించాలని కోరుతూ ఆమె గురువారం ఎగ్మోర్ కోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై నేడో రేపో విచారణ జరిగే అవకాశం ఉంది.

మెడిసిన్ సీటు పేరుతో రూ.59 లక్షల మోసం

● కాంగ్రెస్ మహిళా నేత అరెస్ట్

పెరంబూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైద్య కోర్సులో సీటిప్పిస్తానని రూ.59 లక్షలు కాజేసిన కాంగ్రెస్ మహిళా నేతను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక కిలంబాక్కం సమీపం పడూర్ ఓఎంఆర్ రోడ్డుకు చెందిన దీప సెప్టెంబరులో ఆవడి కేంద్ర నేర విభాగం పోలీస్‌స్టేషన్ చేసిన ఫిర్యాదులో... తన బంధువు లత ద్వారా అనిత అనే మహిళ పరిచయమైందని, ఆమె రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో కీలక బాధ్యతల్లో ఉన్నట్లు తెలిపిందన్నారు. అదే సమయంలో, తనకు ఆలిండియా మెడికల్ కౌన్సిల్ అధికారులు తెలుసని, మీ పెద్ద కుమార్తెకు వైద్య కోర్సు సీటిప్పిస్తానని చెప్పడంతో నమ్మి 2019లో రూ.59 లక్షలు ఇచ్చానని, ఆమె సీటు ఇప్పించకుండా, నగదు తిరిగి ఇవ్వడం లేదని, ఆమెపై తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో దీప కోరింది. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన పోలీసులు, కన్నియాకుమారి జిల్లా అగస్తీశ్వరం శాంతిపురానికి చెందిన కాంగ్రెస్ మహిళా నేత అనితను బుధవారం అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంలో అనితకు సహాయంగా నిలిచిన మరికొందరి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసు ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టుకు బదిలీ

ప్యారీస్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీఎస్పీ తమిళనాడు విభాగం అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసును చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టుకు బదిలీ చేస్తూ ఎగ్మోర్ మేజిస్ట్రేట్ న్యాయస్థానం ఆదేశించింది. పెరంబూరులో జూలై 5న ఆర్మ్‌స్ట్రాంగ్ దారుణ హత్యకు గురయ్యారు. ఈ కేసులో 28 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేయగా, ఈ కేసు విచారణ ఎగ్మోర్ కోర్టులో సాగుతోంది. ఈ నేపథ్యంలో ఈ కేసు విచారణకు గురువారం 27 మంది నిందితులను హాజరుపరిచారు. ఈ సందర్భంగా 5 వేల పేజీల నకళ్లను అందజేసి, కేసు తదుపరి విచారణను ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టుకు బదిలీ చేశారు. ఇదిలావుండగా రౌడీ నాగేంద్రన్ తనను వేలూరు జైలు నుంచి చెన్నై పుళల్ సెంట్రల్ జైలుకు మార్చాలని కోరుతూ కోర్టులో పిటిషన్ వేయగా, దీనిపై జైళ్లశాఖ వివరణ ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది.

వ్యభిచార గృహంలో 9 మంది విదేశీ యువతుల సహా 12 మంది అరెస్టు

చెన్నై, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు భారతీ అవెన్యూ మంగమ్మాళ్ నగర్‌లో వ్యభిచారం చేస్తున్న ముగ్గురు పురుషులు, 9 మంది విదేశీ యువతులు సహా 12 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ముందస్తు సమాచారం మేరకు బుధవారం మంగమ్మాళ్ నగర్‌లోని ఓ ఇంట్లో తనిఖీ చేసిన పోలీసులకు.. అక్కడ విదేశీ యువతులు, ముగ్గురు విటులు కనిపించారు. అక్కడ మరింత క్షుణ్ణంగా తనిఖీ చేయగా, 40 గ్రాముల గంజాయి, హుక్కా పదార్థాలు, 15 సెల్‌ఫోన్లు లభించాయి. దీంతో వాటన్నింటినీ స్వాధీనం చేసుకున్న పోలీసులు.. విదేశీ యువతులు, విటులను అరెస్టు చేశారు. ఓ ప్రైవేటు కార్యాలయం కోసమంటూ ఆ ఇంటిని అద్దెకు తీసుకుని, వ్యభిచారం చేస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

నష్టపోయిన రైతులకు

త్వరలో నష్టపరిహారం

● మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం



నీట మునిగిన వరి పైరు పరిశీలిస్తున్న మంత్రి పన్నీర్‌సెల్వం

ప్యారీస్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వేలాది ఎకరాల్లో పంట నీట మునిగింది. పంట నష్టపోయిన రైతులకు త్వరలోనే నష్టపరిహారం ప్రకటిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఎంకేఆర్‌కే పన్నీర్‌సెల్వం వెల్లడించారు. తంజావూరు జిల్లా అమ్మాపేట సమీపంలోని పల్లవరాయన్ పేట గ్రామంలో వేలాది ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి నీట మునిగింది. దీన్ని మంత్రి పన్నీర్‌సెల్వన్, ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవై చెళియన్ గురువారం పరిశీలించారు. మంత్రి పన్నీర్‌సెల్వం మాట్లాడుతూ, తంజావూరు, తిరువారూర్, నాగపట్టణం, మైలాడుదురై సహా డెల్టా జిల్లాల్లో గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరి పంట నీట మునిగిందని, నష్టపోయిన రైతుల కోరిక మేరకు వరద బాధిత ప్రాంతాలను పరిశీలిస్తున్నామని తెలిపారు. భారీ వర్షాలకు రాష్ట్ర వ్యాప్తంగా 13750 హెక్టార్లలో వరి పంట వర్షార్పణమైందని, పంట నష్టంపై తొలి విడత సర్వే ప్రారంభించినట్టు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన కమిటీ త్వరలోనే పంట నష్టంపై అంచనా వేసి నివేదిక సమర్పించాల్సిందిగా ఆదేశించామన్నారు.

కానిస్టేబుల్ దగ్గర లంచం...

గ్రామ కార్యదర్శి, సర్వేయర్ అరెస్టు

చెన్నై, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఓ పోలీసు దగ్గరే లంచం తీసుకున్న గ్రామ కార్యదర్శి, సర్వేయర్లను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలిలా వున్నాయి... తిరువణ్ణామలై జిల్లా సెంగం తాలూకా ఎస్.అగరం గ్రామానికి చెందిన గ్రామ కార్యదర్శి అజిత్ చెన్నైలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు పెరుంబాక్కంలో ఎకరా భూమి వుండగా, దానిని సర్వే చేయాలని సర్వేయర్ రంజిత్‌కుమార్, పెరుంబాక్కం గ్రామ కార్యదర్శి హరికృష్ణన్‌ను కోరారు. అయితే సర్వే చేయాలంటే రూ.15 వేలు లంచం ఇవ్వాలని వారిద్దరూ డిమాండ్ చేశారు. దీంతో అజిత్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ముందస్తు వ్యూహం మేరకు లంచం పుచ్చుకుంటుండగా రంజిత్‌కుమార్, హరికృష్ణన్‌లను అధికారులు పట్టుకున్నారు. అనంతరం వారిద్దరినీ ఉద్యోగాల నుంచి సస్పెండ్ చేశారు. కాగా రంజిత్‌కుమార్, హరికృష్ణన్‌లను పోలీసులు అరెస్టు చేశారు.

కోవిల్‌పట్టిలో రేషన్ బియ్యం స్వాధీనం

చెన్నై, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా కోవిల్‌పట్టి సమీపంలోని వెళ్లాలంకోట్టై వద్ద ఓ లారీలో వున్న 10 టన్నుల రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖాధికారులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు లారీలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిపోతున్నట్లు తెలుసుకున్న అధికారులు వెళ్లాలంకోట్టై వద్ద వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అందులో బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు స్పష్టం కావడంతో.. వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ లోగా లారీ డ్రైవర్-క్లీనర్ పారిపోయారు. దాంతో స్వాధీనం చేసుకున్న బియ్యం, లారీని పౌరసరఫరాల శాఖ గిడ్డంగులకు తరలించిన అధికారులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కన్నియాకుమారిలో 50 మందిని కరిచిన కుక్క

చెన్నై, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా నిత్తిరవిళై సమీపంలోని పూత్తురై జాలరి గ్రామంలో బుధవారం ఓ పిచ్చికుక్క 50 మందిని కరిచింది. దీంతో 8 మంది చిన్నారులు సహా బాధితులంతా తూత్తూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి చేయిదాటడంతో గ్రామస్తులంతా ఏకమై ఆ పిచ్చికుక్కను వెంటాడి హతమార్చారు.

సిమెంట్ షీట్ పడి న్యాయవాది మృతి

ప్యారీస్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుపూరులోని ఓ వ్యాయామ శిక్షణ కేంద్రంలో గసిమెంట్ షీట్ విరిగిపడటంతో రవి (58) అనే న్యాయవాది బుధవారం మరణించారు. తిరుపూరు కుమరన్ రోడ్డులో తన స్నేహితుడు నిర్వహిస్తున్న జిమ్‌లో సిమెంట్ షీటు కింద అమర్చిన ఫ్యాను పనిచేయకపోవడంతో ఎలక్ట్రికల్ వర్క్ తెలిసిన న్యాయవాది రవి రిపేరు చేసేందుకు ఉపక్రమించాడు. ఆ సమయంలో సిమెంట్ షీటు విరిగిపోయింది. దీంతో తీవ్రంగా గాయపడిన రవి అక్కడే మరణించాడు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

కాంగ్రెస్ కౌన్సిలర్ దుర్మరణం

అడయార్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా ఒండియపుదూర్‌కు చెందిన కాంగ్రెస్ కౌన్సిలర్ కృష్ణమూర్తి (60) చెరువులో పడి ప్రాణాలు కోల్పోయారు. ఈయన బుధవారం రాత్రి ఒండిపుదూరు ప్రాంతంలో కారులో బయలుదేరారు. ఆయన నొయ్యల్ చెరువు వంతెనపై కారును ఆపి మూత్రవిసర్జన చేస్తూ కాలు జారి చెరువులో పడిపోయారు. ఆ సమయంలో చెరువులోని పెద్దబండరాయిపై పడటంతో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడే ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

చెట్టును ఢీకొన్న బైకు..

ఇద్దరు యువకుల మృతి

ప్యారీస్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లా సంగగిరి సమీపం కలిపట్టి ప్రాంతంలో చెట్టును బైకు ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మరణించారు. కలిపట్టి ప్రాంతానికి చెందిన కార్తీక్ (26) అనే బస్సు డ్రైవర్ తన మిత్రుడు మూర్తి (25)తో కలిసి బుల్లెట్ మీద వెళ్ళయంపాళెం వెళ్ళి బుధవారం రాత్రి 8.30 గంటల సమయంలో ఇంటికి బయలుదేరారు. వారిద్దరూ కొంగనాపురం రోడ్డులో వస్తుండగా బైకు అదుపుతప్పి రోడ్డు పక్కన చింతచెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలు తగలడటంతో వారిద్దరూ ఘటనా స్థలంలో మరణించారని పోలీసులు వెల్లడించారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

ఆరుగురు జాలర్లను కాపాడిన నావికాదళం



సముద్రంలో చిక్కుకున్న జాలర్లను హెలికాప్టర్ ద్వారా రక్షించిన నావికాదళం

పెరంబూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కడలూరు నుంచి చేపల వేటకు వెళ్లి రెండు రోజులుగా సముద్రంలో చిక్కుకున్న జాలర్లను నావికాళం సిబ్బంది రక్షించారు. కడలూరు తైకాల్‌తోనిదురై ప్రాంతానికి చెందిన మణికన్నన్, తమిళ్, సామిదురై, మణిమారన్, దినేష్, సర్గుణం రెండు పడవల్లో చేపల వేటకు వెళ్లగా, వాయుగుండం కారణంగా సముద్రంలో చిక్కుకుపోయారు. వారి పడవలు నీటమునగగా, ఆ ప్రాంతంలోని ప్రైవేటు నౌకలను ఉంచే జట్టిలోకి చేరుకున్నారు. రెండు రోజులగా వారిని రక్షించేందుకు వాతావరణం అనుకూలించలేదు. ఈ నేపథ్యంలో, నావికాదళానికి చెందిన హెలికాప్టర్ ద్వారా కడలూరు నుంచి 2 కి.మీ దూరంలో చిక్కుకున్న ఆరుగురు జాలర్లను రక్షించి తీరానికి చేర్చారు.

రాష్ట్రాన్ని కాపాడేందుకే డీఎంకేతో చెలిమి

● బహిష్కరణ సమయంలో కుంగిపోయాను

● ఎండీఎంకే నేత వైగో

చెన్నై, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డీఎంకేలో ఉంటూ మూడు దశాబ్దాలపాటు నిర్విరామంగా సేవలందించి, 27సార్లు జైలుకెళ్లిన తాను ఆ పార్టీ నుంచి బహిష్కరించినప్పుడు మానసికంగా కుంగిపోయానని, పార్టీ నుండి వైదొలగినప్పుడు తొమ్మిది మంది జిల్లా కార్యదర్శులు, 300లకు పైగా సర్వసభ్యమండలి సభ్యులు తన వెంట వచ్చారని ఎండీఎంకే నేత వైగో గుర్తు చేసుకున్నారు. స్థానిక ఎగ్మూరులోని పార్టీ కార్యాలయం తాయగంలో గురువారం ఉదయం ఎల్టీటీఈ నేత ప్రభాకరన్ జయంతి సందర్భంగా ఆయన పాత సంగతులను గుర్తు చేసుకున్నారు. వేల సంఖ్యలో పార్టీ సభలు, 500 కి.మీ.లకు పైగా పాదయాత్ర చేశానని చెప్పారు. కొన్నేళ్లపాటు డీఎంకేకు తాను దూరమైనా రాష్ట్రాన్ని దుష్టశక్తుల నుండి కాపాడేందుకు ఆ పార్టీ కూటమిలో చేరి మద్దతునిస్తున్నామని ఆయన చెప్పారు. పార్టీకి దూరమైనప్పుడు డీఎంకే అధినేత దివంగత కరుణానిధితో రహస్య సంబంధాలు కొనసాగించానని తెలిపారు. శ్రీలంకలో ప్రత్యేక ఈలం పోరు కొనసాగుతున్నప్పుడు ఎల్టీటీఈ సభ్యులకు తన ఇంటిలో, బంధువుల ఇంటిలోను ఆశ్రయం కల్పించి వారికి ఆహారం సహా అన్ని సదుపాయాలు కల్పించానని చెప్పారు. ఎల్టీటీఈ నేత ప్రభాకరన్‌ను కలుసుకోవడానికి రహస్యంగా నాటుపడవలో శ్రీలంక వెళ్లానన్నారు. తిరుగు ప్రయాణంలో శ్రీలంక సైనికులు పట్టుకుంటే చిత్రహింసలు చేస్తారన్న అనుమానంతో ప్రభాకరన్ మెడలో ఉన్న రెండు సైనేడ్ గుళికల్లో ఒకదానిని తీసుకుని తన మెడలో కట్టుకున్నానని తెలిపారు. ప్రభాకరన్ చేతుల మీదుగా అందుకున్న ఆ సైనేడ్ గుళికను ఇప్పటికీ భద్రపరచుకున్నానని వైగో పేర్కొన్నారు.

అన్ని పార్టీల్లో అంతర్గత విభేదాలు సహజమే

● అన్నాడీఎంకే నేత ఉదయకుమార్

ప్యారీస్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అన్ని రాజకీయపార్టీల నేతల్లోనూ అంతర్గత సమస్యలు, వివాదాలు తలెత్తడం సహజమేనని అన్నాడీఎంకే సీనియర్ నేత, అసెంబ్లీలో ప్రతిపక్ష ఉపనేత ఆర్‌పీ ఉదయకుమార్ వ్యాఖ్యానించారు. గురువారం మదురైలో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఉపముఖ్యమంత్రి ఉదయనిధి పుట్టిన రోజు సందర్భంగా ప్రభుత్వ పథకాల గురించి, భవిష్యత్తులో ప్రవేశపెట్టనున్న పథకాల గురించి చెప్పకుండా.. అన్నాడీఎంకేలో జరిగిన ఘర్షణ గురించి మాట్లాడ్డం ఏంటని ప్రశ్నించారు. ఇప్పటి వరకూ అన్నాడీఎంకే తరఫున జరిగిన జిల్లా స్థాయి సమావేశాల్లో 2 వేల మందికి పైగా సభ్యులను చేర్చామన్నారు. కార్యకర్తలకు ఫొటో గుర్తింపుకార్డులు, కొత్త సభ్యులను చేర్చుకోవడం, 2026 అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కోవడం గురించి చర్చించేందుకే ఆ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. ఏ పార్టీలో అయినా రెండు గ్రూపుల మధ్య వివాదం తలెత్తడం సహజమని, దీనిని ఉదయనిధి హేళనచేస్తూ మాట్లాడ్డం విడ్డూరంగా వుందన్నారు.రాజ్యాంగం కల్పించిన హక్కుల మేరకు ప్రతి ఒక్కరికీ అభిప్రాయం వ్యక్తపరిచే హక్కు వుందన్నారు.

హాయిగా ఊపిరి పీల్చుకోండి!

● చెన్నై, మదురై, తిరుచ్చిలో మెరుగైన గాలి నాణ్యత



చెన్నై, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని నగరం చెన్నై, ఆలయాల నగరం మదురై, పరిశ్రమల నగరం తిరుచ్చి నగరాల్లో గాలి నాణ్యత మెరుగుపడింది. రాజ్యసభలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ సహాయమంత్రి కీర్తి వర్ధన్‌సింగ్ ఈ మేరకు లిఖితపూర్వక సమాచారం అందించారు. జాతీయ, రాష్ట్ర, నగరస్థాయి 'క్లీన్ ఎయిర్ యాక్షన్ ప్లాన్' అమలు చేయడం ద్వారా 130 నగరాల్లో గాలి నాణ్యత మెరుగుపరచడానికి పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ 2019 జనవరిలో 'నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం' ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్టు ద్వారా 2025-26 నాటికి పీఎం10 స్థాయిలను 40 శాతానికి తగ్గించవచ్చని, లేదా జాతీయ ప్రమాణాన్ని (మీటరుకు 60 మైక్రోగ్రాములు) సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పథకం అమలు కోసం 2019-20 నుంచి 2025-26 వరకు రూ.16,539 కోట్లు కేటాయించారు. 15వ ఆర్థిక సంఘం మిలియన్ ప్లస్ సిటీ ఛాలెంజ్ ఫండ్ కింద, 48 మిలియన్లకు పైగా జనాభా వున్న నగరాలు, పట్టణ సముదాయాలకు ఇప్పటి వరకూ రూ.9596.66 కోట్లు విడుదల చేసింది. 2023-24లో నిర్వహించిన వార్షిక పనితీరు అంచనా ప్రకారం 2017-18తో పోలిస్తే 2023-24 ఆర్థిక సంవత్సరంలో పీఎం10 సాంద్రత పరంగా 130 నగరాల్లో 97 వాయు నాణ్యతలో మెరుగుదల చూపించాయి. 2017-18తో పోలిస్తే 2023-24 నాటికి 55 నగరాలు పీఎం10 స్థాయిలలో 20 శాతం, లేదా అంతకంటే ఎక్కువ తగ్గింపు సాధించాయి. ఇందులో చెన్నై, మదురై, తిరుచ్చి కూడా ఉండడం విశేషం.

టీవీకే మహానాడు మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్యారీస్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హీరో విజయ్ సారథ్యంలోని టీవీకే మహానాడుకు వెళ్తూ రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు కార్యకర్తలు ప్రాణాలు కోల్పోగా, వారి కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. టీవీకే తొలి మహానాడు గత నెల 27వ తేదీన విల్లుపురం జిల్లా విక్రవాండిలో జరిగిన విషయం తెల్సిందే. మహానాడుకు హాజరై తిరిగి వెళ్తూ ఆరుగురు కార్యకర్తలు రోడ్డు ప్రమాదాల్లో చనిపోయారు. మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేయడంతో పాటు కుటుంబ పరిస్థితిని బట్టి అదనంగా ఆర్థిక సాయంతో పాటు వారి పిల్లలకు విద్యాసాయం చేస్తామని హీరో, ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ ప్రకటించారు.

రోడ్డు ప్రమాదంలో గర్భిణి దుర్మరణం

చెన్నై, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లా కీళనూర్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిది నెలల గర్భిణి మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా... కీళనూరుకు చెందిన మణి సతీమణి విమల (29) మండయార్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. గురువారం ఉదయం 9 గంటలకు తిరుచ్చి-కారైక్కుడి బైపాస్‌రోడ్డులో వున్న పోలీసు స్టేషన్‌కు ద్విచక్రవాహనంపై విమల వెళ్లింది. అక్కడ ఆమె రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మరణించింది.

ఆ పథకాన్ని రాజకీయం చేయొద్దు

● బీజేపీ ఎమ్మెల్యే వానతి



వానతి శ్రీనివాసన్

అడయార్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎంతో ఉన్నతమైన ప్రయోజనాల కోసం ప్రవేశపెట్టిన విశ్వకర్మ పథకాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం పాడుచేయొద్దని బీజేపీ జాతీయ మహిళా విభాగం అధ్యక్షురాలు, కోయంబత్తూరు తూర్పు ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్ ముఖ్యమంత్రి స్టాలిన్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ విశ్వకర్మ పథకాన్ని తమ రాష్ట్రంలో అమలు చేయబోమని సీఎం స్టాలిన్ ప్రకటించిన విషయం తెల్సిందే. దీనిపై వానతి శ్రీనివాసన్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కులవృత్తులను బలోపేతం చేస్తుందన్నారు. అలాంటి పథకాన్ని తమిళనాడులో అమలు చేయబోమని ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖకు సీఎం స్టాలిన్ లేఖ రాయడం దురదృష్టకరమన్నారు. సంప్రదాయ కళాకారులు, చేనేత కార్మికుల నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు, తద్వారా వారి జీవనోపాధిని పెంచేందుకు ఈ పథకాన్ని ప్రధాని మోదీ ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. ఈ పథకం కింద 18 సంప్రదాయ కుల వృత్తులు, చేతివృత్తులకు చెందిన వారు లబ్ది పొందుతారని వెల్లడించారు. తమిళనాడులో కూడా ఈ పథకంలో చేరేందుకు లక్షలాది మంది కళాకారులు ఆసక్తి చూపుతుంటే డీఎంకే ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేయబోమని చెప్పడం బాధాకరంగా ఉందదని, రాజకీయ ప్రయోజనాల కోసం ఒక మంచి పథకాన్ని అడ్డుకోవద్దని వానతి శ్రీనివాసన్ విజ్ఞప్తి చేశారు.

వైభవంగా గంగాదీశ్వరాలయ

కుంభాభిషేకం





రాజగోపుర కలశాలను జలంతో సంప్రోక్షిస్తున్న పండితులు. వేడుకలను తిలకిస్తున్న భక్తులు

చెన్నై, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురుషవాక్కం ప్రాంతంలో అత్యంత ప్రాచీనమైన పంకజాంబాళ్ సమేత గంగాదీశ్వరాలయ కుంభాభిషేకం గురువారం ఉదయం అత్యంత వైభవంగా జరిగింది. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, హైకోర్టు న్యాయమూర్తి భవానీ సుబ్బరాయన్ తదితరులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. యేడాది క్రితం ఈ ఆలయ కుంభాభిషేకానికి రూ.4.82 కోట్లతో జీర్ణోద్ధరణ పనులు ప్రారంభమయ్యాయి. రూ.81 లక్షలతో కొత్త రథాన్ని కూడా నిర్మించారు. ఇటీవలే ఆలయ మరమ్మతులన్నీ పూర్తవడంతో కుంభాభిషేక వేడుకలకు భారీ ఏర్పాట్లు చేపట్టారు. గురువారం వేకువజాము ఆలయంలోని మూలవిరాట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఎనిమిది గంటల సమయంలో రాజగోపురం పైనున్న కలశాలలపై పవిత్రజలాలతో సంప్రోక్షణ చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులపై అర్చకులు పవిత్ర జలాలను చల్లారు. ఈ వేడుకలలో హిందూ దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, అడిషనల్ కమిషనర్ సుకుమార్, డిప్యూటీ కమిషనర్లు లక్ష్మణన్, ముల్లై, కె వనిత, ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మన్ వెట్రికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి

రూ.25 లక్షల ఆర్థికసాయం

● సీఎం వెల్లడి

అడయార్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పుదుకోట జిల్లాలో పుదుక్కోట - తిరుచ్చి జాతీయ రహదారిలో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మహిళా కానిస్టేబుల్ కుటుంబానికి ముఖ్యమంత్రి స్టాలిన్ రూ.25 లక్షల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని మండైయూరు పోలీస్ స్టేషన్‌లో పనిచేసే కానిస్టేబుల్ విమల (28) గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. ఆమె మృతికి సీఎం స్టాలిన్ సంతాపం తెలుపుతూ, ఆమె కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలిపారు. అలాగే, మృతురాలి కుటుంబానికి రూ.25 లక్షల ఆర్థిక సాయం అందజేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

మూడేళ్లలో రైతులకు

1.69 లక్షల ఉచిత విద్యుత్ కనెక్షన్లు

● మంత్రి సెంథిల్ బాలాజీ

ప్యారీస్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రైతులకు గత మూడేళ్లలో తమ ప్రభుత్వం 1,69,564 కొత్త విద్యుత్ కనెక్షన్లను ఉచితంగా ఇచ్చిందని, ఇందువల్ల 3,38,380 ఎకరాల వ్యవసాయ భూములకు సాగునీరందిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి సెంథిల్ బాలాజీ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర రైతుల జీవనాధారాన్ని మెరుగపరిచేలా దేశంలోనే మొట్టమొదటిసారిగా 1989-1990వ సంవత్సరంలో అప్పటి సీఎం కరుణానిధి రైతులకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించారని, అప్పటి నుంచి గ్రామాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. సీఎం స్టాలిన్ సూచనల మేరకు వ్యవసాయ భూములకు కొరత లేకుండా విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టామని వివరించారు.

స్పీకర్ అప్పావు కేసుపై సుప్రీంలో అప్పీల్

అడయార్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ స్పీకర్ అప్పావుపై నమోదైన పరువు నష్టం దావా కేసును మద్రాస్ హైకోర్టు కొట్టివేయడాన్ని అన్నాడీఎంకే నేత ఆర్ఎం బాబు మురుగవేల్ సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు. 2023లో జరిగిన ఒక పుస్తక ప్రదర్శన ప్రారంభోత్సవంలో పాల్గొన్న స్పీకర్ అప్పావు మాజీ ముఖ్యమంత్రి జయలలిత మరణించిన సమయంలో అన్నాడీఎంకేకు చెందిన 40 మంది ఎమ్మెల్యేల డీఎంకేలో చేరేందుకు మొగ్గు చూపారని, అయితే, నాటి ప్రతిపక్ష నేత, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ వారి ప్రతిపాదన తిరస్కరించారని చెప్పారు. ఈ వ్యాఖ్యలపై అన్నాడీఎంకే నేత బాబు మురుగవేల్ తీవ్రంగా ఖండించారు. పైగా అప్పావు చేసిన వ్యాఖ్యలు అన్నాడీఎంకే సభ్యులను అగౌరవపరిచేలా ఉన్నాయంటూ పరువునష్టం దావా వేశారు. ఈ కేసు విచారణ ప్యారీస్ కలెక్టర్ ప్రాంగణంలో ఉన్న ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణ జరగుతుండగా, ఈ కేసును కొట్టివేయాలంటూ మద్రాస్ హైకోర్టులో స్పీకర్ అప్పావు పిటీషన్ దాఖలు చేయగా, దీన్ని పరిశీలించిన కోర్టు ఆ కేసును కొట్టివేసింది. ఈ తీర్పును బాబు మురుగవేల్ వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టులో అప్పీల్ చేశారు.

కొడనాడు కేసు వ్యవహారం...

అన్నాడీఎంకే నేతను విచారించిన సీబీసీఐడీ

ప్యారీస్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లా కొడనాడులో దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలితకు చెందిన బంగ్లాలో 2017వ సంవత్సరంలో జరిగిన హత్య, దోపిడీలకు సంబంధించి అన్నాడీఎంకే నాయకుడి ని సీబీసీఐడీ అధికారులు గురువారం విచారణ జరిపారు. ఈ కేసులో ఇప్పటి వరకూ 500 మందికి పైగా సీబీసీఐడీ అధికారులు విచారణ జరిపి వాంగ్మూలాలను రికార్డు చేశారు. ఈ నేపథ్యంలో అన్నాడీఎంకే రాష్ట్ర నిర్వాహకులు సజీవన్‌ను విచారించేందుకు సీబీసీఐడీ అధికారులు నిర్ణయించారు. సజీవన్ కొడనాడు ఎస్టేట్‌లో వడ్రంగి పనులు పరిశీలించాడు. అందువల్ల అతడిని కూడా హత్య, దోపిడీ ఘటనలకు సంబంధించి, ఎస్టేట్‌లో ఏం గమనించారన్న వివరాలు తెలుసుకునేందుకు విచారణకు రావాలని ఇటీవల సమన్లు పంపిన విషయం తెలిసిందే. ఆ మేరకు గురువారం ఉదయం కోయంబత్తూరులో వున్న సీబీసీఐడీ కార్యాలయంలో సజీవన్ హాజరయ్యారు. కొడనాడు ఎస్టేట్‌లో జరిగిన ఘటనలపై అతడిని ఆరా తీసినట్లు సమాచారం.

నీటివనరుల ఆక్రమణలు తొలగించాల్సిందే

● మద్రాస్ హైకోర్టు

ప్యారీస్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నీటి వనరులను ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించాల్సిందేనని రాష్ట్ర ప్రజాసుల శాఖను మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం ఆదేశించింది. మదురై జిల్లా తిరుప్పరంగుండ్రంకు చెందిన వెట్రివినాయక ఆలయ ఛైర్మన్ జైకొడి మదురై ధర్మాసనంలో ఓ పిటిషన్ వేశారు. మదురై, తిరునగర్, సుందర్‌నగర్ ప్రాంతాల్లో వెట్రివినాయక ఆలయానికి 1969వ సంవత్సరంలో కుంభాభిషేకం నిర్వహించి, ప్రతిరోజూ పూజలు చేస్తున్నట్లు తెలిపారు. అయితే సోమత్తన్ కొలను సమీపంలో వున్న ఆలయ స్థలాన్ని ఆక్రమించి, నిర్మిస్తున్న కట్టడాన్ని కూల్చివేయాలని ప్రజాపనుల శాఖ నోటీసులిచ్చిందని తెలిపారు. అయితే అధికారులు ఎలాంటి సర్వే జరపకుండానే ఆలయంలోని కొంత భాగాన్ని కూల్చివేసేందుకు నిర్ణయించారని, దీనిని అడ్డుకోవాలని పిటిషన్‌లో అభ్యర్థించారు. గురువారం ఈ పిటిషన్‌పై న్యాయమూర్తులు జస్టిస్ జీఆర్ స్వామినాథన్, జస్టిస్ పుహశేందితో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. నీటి వనరులను ఆక్రమించుకుని కట్టిన నిర్మాణాలను తొలగించాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ కేసులో.. అసలు సర్వే జరపకుండానే అధికారులు నిర్ణయం తీసుకున్నారన్న ఆరోపణలున్నందున.. సంబంధితఅధికారులు సర్వేజరిపి, ఆ తరువాత తగిన నిర్ణయం తీసుకోవాలని ఆదేశిస్తూ పిటిషన్‌ను ముగిస్తున్నట్లు ప్రకటించింది.

మెట్రో నిధుల కేటాయింపులో

రాష్ట్రానికి అన్యాయం

● రాజ్యసభ ఎంపీ విల్సన్

పెరంబూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైలు ప్రాజెక్టులో రాష్ట్రానికి తగినంత నిధులు ఇవ్వడం లేదని డీఎంకే రాజ్యసభ సభ్యుడు విల్సన్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' పేజీలో... చెన్నై మెట్రోరైల్ ప్రాజెక్ట్-1 నిర్మాణం, విస్తరణ, రెండవ ప్రాజెక్ట్ 173 కి.మీలకు రూ.85,395 కోట్లు కేటాయిస్తామని కేంద్ర ప్రభుత్వం అంగీకరించిందన్నారు. ఈ క్రమంలో, మెట్రోరైలు ప్రాజెక్ట్-2, విస్తరణకు రూ.15,355.78 కోట్లు అందజేశామని కేంద్ర సహాయ మంత్రి సాహు పేర్కొన్నారని, కానీ, రాష్ట్రానికి కేవలం రూ.986.78 కోట్లు ఇచ్చినట్లు ఆయన లిఖితపూర్వకంగా తెలిపారన్నారు. ఆ ప్రకారం, కేంద్రం మెట్రో రైలు ప్రాజెక్ట్-1, విస్తరణకు ఏ మేరకు నిధులు అందజేస్తోందో మంత్రి స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో, మెట్రోరైలు ప్రాజెక్ట్-2లో తక్కువ నిధులనే కేంద్ర ప్రభుత్వం అందజేసిందని తెలిపారు. ఈ విషయమై కేంద్ర మంత్రులు మనోహర్‌లాల్, నిర్మలా సీతారామన్‌లను ప్రశ్నించినా వారి నుంచి ఎలాంటి సమాధానం లేదన్నారు. దీంతో మెట్రోరైలు ప్రాజెక్ట్ నిర్మాణం కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తగినంత నిధులు అందించలేదని తెలిసిందని ఎంపీ విల్సన్ ఆరోపించారు.

రాజ్‌భవన్ వద్ద చెట్టు పడి

మహిళా కానిస్టేబుల్‌కు గాయాలు



చెట్టు కొమ్మలను తొలగిస్తున్న పోలీసులు

చెన్నై, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండి రాజ్‌భవన్ ఎదుట ఓ చెట్టు గురువారం మధ్యాహ్నం కూలిపడటంతో ఆ ప్రాంతంలో డ్యూటీ చేస్తున్న సాయుధదళ మహిళా కానిస్టేబుల్ నందిని తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం సైదాపేట ఆస్పత్రికి తరలించారు. ఆ తర్వాత పోలీసులు ఆ చెట్టును నరికి తొలగించారు. ఈ సంఘటన కారణంగా ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

అజిత్ కార్ రేస్ శిక్షణ



అగ్రహీరో అజిత్ కుమార్ ఒక వైపు సినిమాల్లో నటిస్తూనే మరోవైపు తనకిష్టమైన రేసింగ్ పోటీల్లో పాల్గొంటున్నారు. ఇటీవల బైక్ రేసింగ్‌లో పాల్గొన్న ఆయన ఇపుడు కార్ రేస్ పోటీల్లో పాల్గొనేందుకు వీలుగా శిక్షణ తీసుకుంటున్నారు. దీనికి సంబంధించిన ఫొటో ఒకటి ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అవుతుంది. ప్రస్తుతం అజిత్ నటిస్తున్న చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. బల్గేరియాలో షూటింగ్ జరుపుకుంటోంది. ఇందులో తన పాత్రకు సంబంధించిన షూటింగ్ పూర్తి చేసి, కార్ రేస్‌లో శిక్షణ పొందుతున్నారు. తాజాగా బార్సిలోనా ఎఫ్-1 కార్ రేస్ సైట్‌లో తన పేరుతో ఉన్న కారు పక్కన నిలబడి ఫొటోకు ఫోజిచ్చారు. ఆ ఫొటోలు ఇపుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాగా, వచ్చే యేడాది దుబాయ్‌లో జరిగే 24హెచ్, యూరోపియన్ 24హెచ్ చాంపియన్‌షిప్ కార్ రేస్ పోటీల్లో అజిత్ కుమార్ జట్టు కెప్టెన్, డ్రైవర్‌గా వ్యవహరించనున్నారు. ఇందుకోసం ఆయన శిక్షణ తీసుకుంటున్నట్టు తెలుస్తుంది. కార్ రేస్ సైట్‌లో అజిత్‌ను చూసిన హీరో మాధవన్ సహా ఆయన అభిమానులు తెగ సంతోషపడుతూ ముందస్తు శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

రియోరాజ్ 'స్వీట్ హార్ట్'
ఫస్ట్‌లుక్ రిలీజ్

మోడరన్ మాస్ట్రో యువన్ శంకర్ రాజా నిర్మాతగా వైఎస్ఆర్ ఫిలిమ్స్ పతాకంపై రూపొందుతున్న 'స్వీట్‌హార్ట్' చిత్రం ఫస్ట్‌లుక్ తాజాగా రిలీజ్ చేశారు. స్వినీత్ ఎస్.సుకుమార్ దర్శకుడుగా పరిచయమవుతున్నారు. రియో రాజ్, గోపికా రమేష్ హీరోహీరోయిన్లుగా నటించే ఈ చిత్రంలో అరుణాచలేశ్వరన్, రెంజీ పనీకర్, తులసి తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీత స్వరాలు సమకూర్చుతున్నారు. రొమాంటిక్ జానర్‌లో కామెడీగా మూవీగా తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని నిర్మాణాంతర కార్యక్రమాలను శరవేగంగా జరుపుకుంటోంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను తాజాగా విడుదల చేశారు. ఇందులో రియోరాజ్, గోపికా రమేష్ లవ్ మేజిక్ చేస్తూ యువ ప్రేమజంటగా కనువిందు చేస్తున్నారు.


'స్వీట్‌హార్ట్' ఫస్ట్‌లుక్

చిత్రజ్యోతి

తుఫాను హెచ్చరిక.. 'మిస్ యూ' రిలీజ్ వాయిదా



తుఫాను హెచ్చరికల నేపథ్యంలో హీరో సిద్ధార్థ్ - ఆషికా రంగనాథ్ జంటగా నటించిన 'మిస్ యూ' చిత్రం విడుదల వాయిదా వేశారు. ఇదే విషయంపై ఆ చిత్ర నిర్మాత సాముయేల్ ఒక ప్రకటన విడుదల చేశారు. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ప్రజల భద్రత దృష్ట్యా తాము నిర్మించిన 'మిస్ యూ' చిత్రం విడుదల వాయిదా వేస్తున్నాం. తదుపరి రిలీజ్ తేదీ వెల్లడిస్తాం. మీ ఆదరణ, మద్దతు ఎన్నటికీ కొనసాగాలని కోరుకుంటున్నాం. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో తమకు అండగా నిలిచిన రెడ్ జెయింట్ మూవీస్, అమెజాన్ ప్రైమ్, అయ్యంగరన్ ఇంటర్నేషనల్, ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్మెంట్, కర్పగ వినాయక ఫిలిమ్ సర్క్యూట్ హౌస్, మీడియాకు హృదయపూర్వక కృతజ్ఞతలు అని పేర్కొన్నారు. 7 మిలియన్ పర్ సెకండ్ బ్యానరుపై తెరకెక్కిన ఈ చిత్రానికి ఎన్.రాజశేఖర్ దర్శకుడు.

← 'మిస్ యూ'లో ఓ దృశ్యం

మాళవిక లేటెస్ట్ క్లిక్స్


మాళవికా మోహనన్

పెద్దగా సినిమా అవకాశాలు లేకపోయినప్పటికీ హీరోయిన్ మాళవికా మోహనన్ మాత్రం అభిమానుల గుండెల్లో గూడుకట్టుకున్నారు. అపుడపుడూ స్పెషల్ ఫొటో క్లిక్స్‌తో ఆమె ఫ్యాన్స్‌ను ఫిదా చేస్తున్నారు. తాజాగా ఆమె కొన్ని ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేయగా, అవి వైరల్ అయ్యాయి. ఇటీవల పా.రంజిత్ దర్శకత్వంలో చియాన్ విక్రమ్ 'తంగలాన్' చిత్రంలో నటించిన మాళవిక.. ప్రస్తుతం కార్తీ హీరోగా నటించే 'సర్దార్-2'లో నటించే ముగ్గురు హీరోయిన్లలో ఒకరిగా నటిస్తున్నారు. అలాగే, ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న 'ది రాజా సాబ్'లో నటించారు. ఈ సినిమా ద్వారా ఆమె తెలుగులో ఎంట్రీ ఇస్తున్నారు. ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాల్లో భారీ సంఖ్యలో ఫాలోయర్లను కలిగిన మాళవిక.. కోలీవుడ్‌కు 'మాస్టర్' మూవీ ద్వారా పరిచయమైన విషయం తెల్సిందే. ఇండస్ట్రీకి పరిచయమైన అతితక్కువకాలంలోనే ఆమె తనకంటూ ఓ స్థానాన్ని, గుర్తింపు సంపాదించుకున్నారు.

అత్యంత మహిమాన్వితమైన తిరుపాచ్చూరు తంగతాళి అమ్మన్ సమేత వాశీశ్వరాలయం తిరువళ్లూరు సమీపంలో ఉంది. తిరుత్తణి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి అనుబంధ ఆలయమిది. ఈ శైవ క్షేత్రంలో వాశీశ్వరర్‌ను పశుపతీశ్వరర్, పాసురనాథర్, ఉడయార్ అనికూడా పిలుస్తారు. ఈ స్వామి చెంతనే స్వర్ణమాంగల్య అమ్మవారు.. పశుపతి నాయకి, మోహనాంబాళ్, పణైములై నాచ్చియార్ అనే పేర్లతో ఉన్నారు. ఈ ఆలయంలోని తీర్థకొలనును సోమతీర్థం, మంగళ తీర్థం అని పిలుస్తారు. వెదురు చెట్టు ఆలయ స్థలవృక్షం. చోళచక్రవర్తి కరికాళచోళుడు ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చరిత్రకారులు చెబుతారు. తంగతాళి దేవి పేరుతో ఈ క్షేత్రం 'తంగతాళి పురం' అని కూడా పిలుస్తారు. ఈ క్షేత్రానికి మాయాపురి, అభయపురం, మాణిక్యపురి, చోళపురం అనే చారిత్రక నామధేయాలున్నాయి. వాశీశ్వరస్వామి భక్తులకు సకలసౌభాగ్యాలను ప్రసాదించడమే కాకుండా సకల దోషాలు, పాపాల నుండి విముక్తి చేస్తారని శైవ పండితులు చెబుతారు. - ఆంధ్రజ్యోతి, చెన్నై

దోష నివారణ క్షేత్రం తంగతాళిపురం

సకల సౌభాగ్యాలనిచ్చే తిరుపాచ్చూరు వాశీశ్వరస్వామి దేవాలయం
అష్టాదశ గణపతులు కొలువైన ఏకైక శైవక్షేత్రం


ఆలయ అంతర ప్రాకారం


వాశీశ్వరస్వామి, స్వర్ణమాంగల్యధారిణి


మూలవిరాట్టు వాశీశ్వరస్వామి

స్థలపురాణం...

ఈ ప్రాంతం పూర్వం వెదురుచెట్లతో దట్టమైన చిట్టడవిని తలపించేలా ఉండేది. ఈ అటవీ మార్గంలో ఓ యాదవ యువకుడు మేకలు మేపుతూ పాలు తలపై పెట్టుకుని వెళ్తుండేవాడు. ప్రతిరోజూ ఆ మార్గంలో నడిచి వెళ్తుంటే ఓ పొద దగ్గర జారి పడటం ఆనవాయితీగా మారింది. ఇలా పాలు పడిపోతుండటంతో ఆగ్రహం చెంది, ఆ యువకుడు పలుగుపార పట్టుకుని ఆ పొద తవ్వాడు. అతడి పలుగు స్వయంభువుగా వెలసిన లింగం శిరోభాగాన్ని తాకి రక్తం పెల్లుబుకింది. అది చూసి భీతిల్లిన ఆ యాదవుడు ఊరిలోకి వెళ్ళి జరిగిన సంఘటనను తెలిపాడు. ఊరి ప్రజలంతా రక్తం కారుతున్న శివలింగాన్ని చూసి దిగ్భ్రాంతి చెంది చోళచక్రవర్తికి తెలిపారు. రాజు ఆ ప్రాంతాన్ని సందర్శించి ఆలయాన్ని నిర్మించమని ఆదేశించారు. ఆ ప్రకారమే అక్కడ అందమైన ఆలయం వెలసింది. గర్భాలయంలోని లింగంపైన గాయం తగిలినట్లు బొటన వేలి సైజులో పగిలి ఉండటంతో ఆ లింగాన్ని పూజారులు చేతులతో తాకకుండా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వెదురుచెట్ల అడవిలో పరమేశ్వరుడు స్వయంభువుగా ఆవిర్భవించడం వల్ల ఆయనకు పచ్చుర నాథర్ అని, ఆప్రాంతాన్ని తిరుపాచ్చూరు అని పిలుస్తున్నారు.

ఆధ్యాత్మికం


ధ్వజస్తంభం


స్థలవృక్షం (వెదురుచెట్టు)

పూజలు

దాంపత్యంలో అన్యోన్యత కోసం భక్తులు తంగతాళి దేవిని ప్రార్థిస్తారు. వివాహ ఆటంకాలను తొలగించమంటూ ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ ఆలయంలో కాల శాంతి, ఉచ్చికాల, సాయం సంధ్యా, అర్ధజాము ఇలా నాలుగు కాలాల పూజలు నిర్వహిస్తారు. తమిళ వైయ్యాశి నెల (మే-జూన్)లో పదిరోజుల బ్రహ్మోత్సవాలు, మార్గశిర మాసంలో ఆరుద్రదర్శనం, మహాశివరాత్రి వేడుకలు, ప్రతినెలా ప్రదోష పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

చారిత్రక నేపథ్యం

పూర్వం కురుంబన్ అనే ఊరి పెద్ద చోళ చక్రవర్తికి పన్నులను సకాలంలో చెల్లించలేదు. కురుంబుడు మహాంకాళి భక్తుడు. కురుంబుడు చెల్లించాల్సి పన్నులను వసూలు చేయడాదనికి రాజు ఆ ప్రాంతానికి దండెత్తారు. ఆ రాజును, సైనిక దళాన్ని ఓడించేందుకు సాయపడాలని కురుంబుడు కాళికాదేవిని ప్రార్థించాడు. అదే సమయంలో యుద్ధానికి వచ్చిన రాజు శైవభక్తుడు కావటంతో కాళికాదేవిని కట్టడి చేసేందుకు నందీశ్వరుడిని పంపారు. నందీశ్వరుడు కాళికాదేవిని ఓడించి ఆమెపాదాలను సంకెళ్లతో బంధించాడు. ఆ సంఘటనను గుర్తు చేసేలా ఆయలంలో పాదాలు సంకెళ్లతో బంధించినట్టుగా కాళికాదేవి విగ్రహం ఉంది. ఈమెను స్వర్ణకాళి అని పిలుస్తారు. పౌర్ణమిరోజుల్లో సాయం సమయాల్లో ఆమెకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.


అష్టాదశ వినాయక మండపం

ఆలయ విశేషాలు..

పార్వతీదేవి ఈ క్షేత్రంలో పరమశివుడిని ఆరాధించినట్లు చెబుతుంటారు. ఆమె తపస్సును మెచ్చి పరమేశ్వరుడు ప్రత్యక్షమై జవరాలా (ప్రియురాలా) అంటూ ఆప్యాయంగా పిలిచారనది పురాణగాథ. వేదాలను అపహరించిన అశురులను సంహరించడం వల్ల కలిగిన దోషాన్ని తొలగించుకునేందుకు మహా విష్ణువు కూడా ఈ క్షేత్రంలోని పరమేశ్వరుడిని పూజించినట్లు చెబుతారు. ఇక్కడ పరమేశ్వరుడు మహావిష్ణువు పాపాలను పోగొట్టడటంతో స్వామివారిని 'పెరుమాళ్ విన్నై తీర్థ ఈశ్వరర్' అని పిలుస్తారు. చంద్రుడు, కౌశికుడు ఈ స్వామివారిని అరాధించినట్లు స్థలపురాణాలు చెబుతోంది. ఈ ఆలయం నడుమనున్న ఓ మండపంలో వివిధ భంగిమలలో అష్టాదశ (పదుకొండు) గణపతులు కొలువుదీరి ఉన్నారు. ఇలా ఒకే చోట 11 వినాయక విగ్రహాలు కొలువుదీరి ఉండటం ఏ శివాలయంలోనూ చూడలేమని శైవాగమపండితులు చెబుతున్నారు.


ఆలయ ప్రవేశ తోరణం

ఆలయానికి వెళ్లే మార్గం...

ఈ ఆలయం జిల్లా కేంద్రం తిరువళ్లూరుకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. చెన్నై నుంచి లోకల్ విద్యుత్ రైళ్లలో, మహానగర రవాణాసంస్థ బస్సుల్లో, రాష్ట్ర రవాణా సంస్థ బస్సుల్లో తిరువళ్లూరు చేరుకోవచ్చు. అక్కడి నుంచి టౌన్ బస్సులు గాని ఆటోలో గాని తిరుపాచ్చూరుకు చేరుకోవచ్చు. లోకల్ రైళ్లలో వెళ్లే భక్తులు కడంబత్తూరు రైల్వే స్టేషన్‌లో దిగి అక్కడి నుంచి సిటీ బస్సు, షేర్ ఆటోలో ఈ ఆలయ ప్రాంతానికి వెళ్ళవచ్చు. ఈ ఆలయాన్ని ప్రతి రోజూ ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.


ఆలయ రాజగోపురం

ఆలిండియా రైల్వే బాల్ బ్యాడ్మింటన్
ఛాంపియన్‌షిప్ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఆర్ఎన్ సింగ్

చెన్నై, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయనావరంలో 59వ ఆలిండియా రైల్వే బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. దక్షిణ రైల్వే జనరల్ మేనేజర్ ఆర్ఎన్.సింగ్ ఈ పోటీలను ప్రారంభించారు. దక్షిణరైల్వే అదనపు జనరల్ మేనేజర్ కౌశల్ కిషోర్, దక్షిణ రైల్వే క్రీడా సంఘం అధ్యక్షుడు, చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ సోమేష్‌కుమార్, కార్యదర్శి బి.విశ్వనాథ్ ఈర్య, సీనియర్ స్పోర్ట్స్ ఆఫీసర్ కె.సారమ్మ, అసిస్టెంట్ స్పోర్ట్స్ ఆఫీసర్ వి.దేవరాజన్, స్పెషల్ డ్యూటీ ఆఫీసర్ పి.అనిత తదితరులు ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఇదిలా వుండగా ఈ సంవత్సరం ఛాంపియన్‌షిప్‌లో జోనల్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఏడు జట్ల నుంచి వంద మంది క్రీడాకారులకు ఆతిథ్యం ఇవ్వనున్నారు. ఈ ఛాంపియన్‌షిప్ టైటిల్ కోసం డిఫెండింగ్ ఛాంపియన్స్ నదరన్ రైల్వే, సౌత్‌వెస్ట్రన్ రైల్వేతో పాటు సౌత్ సెంట్రల్ రైల్వే, సౌత్ ఈస్టర్న్ రైల్వే, ఈస్ట్ సెంట్రల్ రైల్వే, వెస్ట్రన్ రైల్వే, ఐసీఎఫ్ జట్లు పోటీ పడుతున్నాయి. బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ జరుగుతున్న అయనావరంలోని 'డి.రాజారామన్ బాల్ బ్యాడ్మింటన్ స్టేడియం' కూడా గురువారమే ఆర్ఎన్ సింగ్ ప్రారంభించడం విశేషం.

అగస్త్రీశ్వరాలయంలో
నూతన విగ్రహాల ప్రతిష్ఠ


విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న వాదవూరు అడిగళార్ ఆలయ నిర్వాహకులు తదితరులు

చెన్నై, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా చెంబేడు గ్రామంలో అరుళ్‌మిగు మంగళాంబిక సమేత అగస్త్రీశ్వరాలయంలో నూతన సన్నిధి అష్టబంధన వేడుకలు, లోపాముద్ర సమేత అగస్త్య స్వర్ణ ఆకర్షణ భైరవ విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవం గురువారం ఉదయం గోపూజతో నిర్వహించారు. యాగశాల పూజల అనంతరం మహాభిషేకం నిర్వహించారు. ఈ ఉత్సవంలో శివలోక ధ్యానపీఠం నిర్వాహకులు వాదవూరు అడిగళార్ పాల్గొని భక్తులను ఆశీర్వదించారు. ఈ వేడుకల్లో జగన్మోహనరావు, పెరంబూరు శీనివాసన్, సూర్యప్రకాష్, అన్నానగర్ ప్రభాకర్, మారి మణికంఠన్, జనకల్యాణ్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

డీఆర్ఏ ప్రచారకర్తగా రష్మిక మందన్నా



విలేఖరుల సమావేశంలో రంజిత్ రాథోడ్

అడయార్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): చెన్నై మహానగరంలోని ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీ డీఆర్ఏ తొలిసారి బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ హీరోయిన్ రష్మిక మందన్నాను ఎంపిక చేసింది. ఈ విషయాన్ని ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ రంజీత్ రాథోడ్ గురువారం వెల్లడించారు. అంతేకాకుండా 2026-27 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి రూ.1000 కోట్ల టర్నోవర్ లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. తమిళనాడు మార్కెట్‌లో మరింతగా విస్తరించడంతో పాటు మహారాష్ట్రలోని పూణెలో అడుగుపెట్టాలని భావిస్తున్నామన్నారు. మనదేశంలో సొంతిల్లు కొనుగోలు చేయడం అనేది చాలా మంది కల మాత్రమే కాకుండా, గర్వకారణంగా భావిస్తారన్నారు. వీరి కల నెరవేర్చేలా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే ధరల్లో గృహాలను విక్రయించడంతో పాటు నిర్ణీత గడువులోగా ఇంటి తాళాలను వారికి అందజేయడంలో తమ కంపెనీకి మంచి పేరు ఉందని ఆయన తెలిపారు.

తమిళ జాలర్లను విడిపించండి!

- కేంద్రమంత్రికి కనిమొళి వినతి


రాజ్‌నాథ్‌సింగ్‌కు వినతి పత్రం అందజేస్తున్న డీఎంకే ఎంపీ కనిమొళి

చెన్నై, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు చెందిన పదిమంది జాలర్లను విడిపించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు డీఎంకే ఎంపీ కనిమొళి విజ్ఞప్తి చేశారు. లక్ష ద్వీపాల సమీపంలో చేపలు పపడుతూ సముద్రతీర భద్రతాదళం అధికారులు నిర్బంధించిన తూత్తుకుడి జిల్లాకు చెందిన 10 మంది జాలర్లను విడుదల చేయించాలని పార్లమెంట్ సమావేశాల కోసం ఢిల్లీలో ఉన్న కనిమొళి రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలుసుకుని వినతిపత్రం సమర్పించారు. అదే విధంగా గుజరాత్ రాష్ట్రం పోర్‌బందర్ సమీపంలో చేపలవేట సాగిస్తూ గల్లంతైన తూత్తుకుడి అయన్‌బొమ్మైయాపురం ప్రాంతానికి చెందిన జాలరి అన్నాదురై ఆచూకీ కనుగొనేందుకు చర్యలు చేపట్టాలని కూడా ఆమె కోరారు.

జార్ఖండ్ సీఎంకు ఉదయనిధి శుభాకాంక్షలు


హేమంత్ సోరెన్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఉదయనిధి

పెరంబూర్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జార్ఖండ్ ముఖ్యమంత్రిగా గురువారం పదవీప్రమాణం చేసిన హేమంత్ సోరన్‌కు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం తన 'ఎక్స్' పేజీలో... జార్ఖండ్ రాష్ట ముఖ్యమంత్రిగా హేమంత్ సోరన్ పదవీప్రమాణం వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి తరపున తాను పాల్గొన్నాను. హేమంత్ సోరన్‌కు, ఆయన మంత్రి వర్గ సహచరులకు హృదయపూర్వక శుభాకాంక్షలు. జార్ఖండ్ ప్రజలు ఆకాంక్షలు నెరవేరేలా, రాష్ట్రం అభివృద్ధి చెందేలా హేమంత్ సోరన్ ప్రభుత్వం కృషిచేస్తుందని నమ్మకం ఉంది. తమిళనాడు-జార్ఖండ్ రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు కొనసాగాలని కోరుకుంటున్నట్లు ఉప ముఖ్యమంత్రి ట్వీట్ చేశారు.





చిన్నశేషుడిపై పద్మావతి అమ్మవారు



తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు గురువారం ఉదయం ధ్వజారోహణంతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటూ జరిగే ఉత్సవాలు విజయవంతమయ్యేందుకు ధ్వజస్తంభం ఎదుట అర్చకులు పూజలు చేసి సకల దేవతామూర్తులను ఉత్సవాలకు ఆహ్వానించి దిగ్బంధనం చేశారు. ఉదయం 6.30 గంటలకు చక్రాత్తాళ్వార్ ముందు సాగగా వెనుకనే అమ్మవారికి అభిముఖంగా గజ చిత్రపటాన్ని తిరువీధుల్లో ఊరేగిస్తూ ఆలయానికి తీసుకొచ్చారు. యాగశాల నుంచి మొలకెత్తిన నవధాన్యాలను ధ్వజస్తంభం ముందు ఉంచి పూజలు చేశారు. అనంతరం ధ్వజస్తంభంపై ఉన్న గజప్రతిమకు సుగంధ పరిమళ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ప్రారంభసూచికగా గురువారం ఉదయం 9.30 గంటలకు ధ్వజారోహణం చేశారు. అదే సమయంలో అమ్మవారి మూలమూర్తికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. కంకణభట్టారు శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆయా కార్యక్రమాల్లో జీయర్‌స్వాములు, టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో సతీష్‌కుమార్, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుబ్బరాయుడు, సుభాస్కరనాయుడు పాల్గొన్నారు.

కానుకగా గొడుగులు

చెన్నైకి చెందిన వీర్ వసంత్‌కుమార్ గురువారం ఆరు గొడుగులను అమ్మవారి ఆలయానికి కానుకగా అందించారు. టీటీడీ ఈవో శ్యామలరావుకి భక్తులు ఆలయం వద్ద అందజేశారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు	
	ఉదయం 8 గంటలకు పెద్దశేష వాహనం
	మధ్యాహ్నం 12.30 గంటలకు స్నపన తిరుమంజనం
	సాయంత్రం 5.30 గంటలకు ఊంజల్ సేవ
	రాత్రి 7 గంటలకు హంసవాహనం



అంగరంగ వైభవం అమ్మవారి బ్రహ్మోత్సవం



సకల దేవతలు అతిథులుగా రాగా, అఖిల జనకోటి ఆనందపరవశం కాగా ఎగిరింది ధ్వజపటం. ఎగసింది జయ జయధ్వానం. బ్రహ్మాండ నాయకుడి ప్రియదేవకి పద్మావతిదేవి కార్తీక బ్రహ్మోత్సవాలు తిరుచానూరులో వైభవంగా మొదలయ్యాయి. టీటీడీ కళాబృందాల సాంస్కృతిక ప్రదర్శనలు భక్తకోటికి ఆకట్టుకున్నాయి. ప్రకృతి రమణీయత ఉట్టిపడేలా ఏర్పాటు చేసిన ఫల, పుష్ప ప్రదర్శన యాత్రికుల మనసు దోచుకుంది.

\- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

ఫల పుష్ప సోయగం

తిరుచానూరులోని అమ్మవారి శుక్రవారపు తోటలో టీటీడీ ఉద్యానశాఖ ఏర్పాటు చేసిన ఫలపుష్ప ప్రదర్శన భక్తులకు కనువిందు చేస్తోంది. ఈ ప్రదర్శనను టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం కలిసి ప్రారంభించారు. పురాణ గాథలకు సంబంధించి ఏర్పాటు చేసిన వివిధ ఘట్టాల ప్రదర్శనలు విశేషంగా నిలుస్తున్నాయి. వివిధ పుష్పాలు, కూరగాయలతో ఏర్పాటు చేసిన జంతువులు, పక్షుల ఆకృతులు భక్తులను విశేషంగా ఆకర్షించాయి. ఉద్యానవనశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు నేతృత్వంలో ఫల, పుష్ప ప్రదర్శనశాల అద్భుతంగా తీర్చిదిద్దారు. మైసూరుకు చెందిన గౌరి గత 9 సంవత్సరాలుగా సైకత శిల్పాన్ని తయారు చేస్తున్నారు. ఈ ఏడాది పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి సైకత శిల్పాన్ని రూపొందించారు. అదే విధంగా ఎస్వీ ఆయుర్వేద కళాశాల ఆధ్వర్యంలో ఎక్స్‌పోఆయు, ఎస్వీ ఆయుర్వేద ఫార్మసీ ఆధ్వర్యంలో వనమూలికా ప్రదర్శన, ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఎస్వీ సంప్రదాయ ఆలయ శిల్ప శిక్షణ సంస్థ ఏర్పాటు చేసిన శిల్పకళ ప్రదర్శనశాల భక్తులను ఆకట్టుకుంది.



పట్టువస్త్రాల సమర్పణ



రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి గురువారం సాయంత్రం అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయం వద్ద ఆయనకు టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, సీవీఎస్వో శ్రీధర్, అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం ప్రసాదాలు అందజేశారు. అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్టు మీడియా సమావేశంలో మంత్రి చెప్పారు. సీఎం చంద్రబాబు ఆలోచనల మేరకు అన్ని దేవాలయాల్లో మెరుగైన మార్పులు తీసుకొచ్చేలా చర్యలు చేపట్టామన్నారు.

భక్తులకు సకల సౌకర్యాలు

టీటీడీ ఈవో శ్యామలరావు

అమ్మవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సదుపాయాలు ఏర్పాట్లు చేశామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. గురువారం తిరుచానూరులో ధ్వజారోహణం కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల తరహాలో అమ్మవారి బ్రహ్మోత్సవాలను కూడా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు మూలమూర్తితోపాటూ, వాహన సేవలను సంతృప్తిగా తిలకించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు.

తిరుచానూరులో తిరుమల లడ్డూలు

అమ్మవారి బ్రహ్మోత్సవాలు తిలకించేందుకు వచ్చే భక్తులకు తిరుచానూరులోని ఆలయ ప్రాంగణంలోని లడ్డూ కౌంటర్‌లో తిరుమల లడ్డూలు కూడా విక్రయిస్తున్నారు. దర్శనానంతరం ఆలయం లోపల ఉన్న కౌంటర్లో లడ్డూ టికెట్లు ఇస్తారు. వాటితో బయటున్న కౌంటర్లో శ్రీవారి లడ్డూలు కొనుగోలు చేసుకోవచ్చు. రోజూ పదివేల తిరుమల లడ్డూలు తిరుచానూరులో అందుబాటులో ఉంచుతామని ఆలయ డిప్యూటీ ఈవో గోవింద రాజన్ తెలిపారు.



కత్తితో బెదిరించి దోపిడీయత్నం

మన్నారుపోలూరులో పట్టపగలే ఘటన ● అడ్డొచ్చిన మహిళను ఆటోలో వేసుకెళ్లేందుకు ప్రయత్నించిన దుండగులు

సూళ్లూరుపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అడ్రస్ కావాలంటూ అడిగారు. ఆపై కత్తితో బెదిరించి ఇంట్లో దోపిడీకి యత్నించారు. ఈ ఘటన సూళ్లూరుపేట మండలం మన్నారుపోలూరులో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన ప్రకారం.. మన్నారుపోలూరు చేనేత కాలనీలో నివాసం ఉంటున్న తాపీ కూలీ పూడి మునస్వామి గురువారం పనికి వెళ్లారు. ఇంట్లో ఆయన భార్య దేవి, కుమారుడు చందు ఉన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ముగ్గురు వ్యక్తులు వీరి ఇంటి పక్కనే రోడ్డులో ఆటో నిలిపారు. అందులో ఒకడు వీరి ఇంటికొచ్చి ఏదో అడ్రసు కావాలంటూ తమిళంలో అడిగాడు. ప్రహరీ అవతల నుంచి అడ్రసు చెబుతున్న దేవి.. బయట మరో ఇద్దరు ఉండటం.. ఇతడు మద్యం తాగి ఉన్నాడని గమనించారు. అదే సమయంలో ఇంట్లోనే ఉన్న కుమారుడు చందు బయటకు వచ్చి ఇక్కడ అటువంటి అడ్రసు లేదంటూ చెప్పారు. ఆ వెంటనే దుండగులు ఈ అడ్రసు మాకు తెలియదు చెప్పండంటూ బలవంతంగా ఆ ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసి చందు మెడపై కత్తి పెట్టారు. అరిస్తే చంపేస్తామంటూ బెదిరించారు. పక్కనే ఉన్న దేవి కేకలు వేయడంతో పక్క ఇంట్లో ఉన్న వల్లూరు వెంకటమ్మ అరుస్తూ వెళ్లి తలుపులు కొట్టింది. దీంతో చుట్టుపక్కల వాళ్లు వచ్చారన్న భయంతో దుండగులు తలుపులు తీసి పారిపోయేందుకు ప్రయత్నించారు. అయితే, చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో వెంకటమ్మను బలవతంగా ఆటో వద్దకు లాక్కెళ్లి బెదిరించారు. కాసేపు వారితో పెనుగులాడిన ఆమె తప్పించుకొని పరుగెడుతూ ఇంట్లోకి వెళ్లారు. అప్పుడే భోజనానికి వస్తున్న మునస్వామి ఏమి జరిగిదంటూ అరవడంతో దుండగులు ఆటోలో సూళ్లూరుపేట వైపు వెళ్లారు. వెంటనే బాధితులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెళ్లి వివరాలు తీసుకొన్నారు. ఆంధ్ర, తమిళనాడుకు సరిహద్దులో ఉండటంతో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి.



వివరాలు వెల్లడిస్తున్న బాధితులు దేవి, చందు

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 7 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. ఇక, మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించింది. రూ.3.75 కోట్లు ఆదాయం లభించినట్టు గురువారం ఉదయం ప్రకటించింది. బుధవారం 67,626 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 22,231 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

స్విమ్స్‌లో ఎమ్మెస్సీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి(వైద్యం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ బయో టెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వనజాక్షి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ 1, బయో ఇన్ఫర్మేటిక్స్ 4 సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఏపీ పీజీసెట్‌కు సంబంధం లేకుండా వీటిని భర్తీ చేస్తామని, అభ్యర్థులు ఈనెల 29న స్విమ్స్‌లో నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు.

రేపు స్వర్ణముఖి నదీ హారతులు

● రాహుకేతు పూజలు మినహా ఆర్జిత సేవల రద్దు

శ్రీకాళహస్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణముఖిలో నదీహారతులు సమర్పించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈనెల 30న శనివారం సాయంత్రం 7గంటలకు స్వర్ణముఖి నదీ తల్లికి కలశపూజలు, ధూప, దీప, నైవేద్యాలు, మహాదీపారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు వీక్షించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. కాగా నదీహారతులను పురస్కరించుకుని ఆలయంలో రాహుకేతు పూజలు మినహా అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసినట్లు ఈవో తెలిపారు.

ముక్కంటి ఆలయ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి సస్పెన్షన్

శ్రీకాళహస్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి చంద్రయ్యను సస్పెండ్ చేస్తూ ఈవో బాపిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ముక్కంటి ఆలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న జ్ఞానప్రసూనాంబిక నర్సింగ్ కళాశాల వ్యాన్ క్లీనర్‌గా చంద్రయ్య విధులు నిర్వహించాల్సి ఉంది. అయితే రెండు రోజుల క్రితం ముక్కంటి ఆలయంలో సంచరిస్తూ అడ్డదారిలో భక్తులను దర్శనానికి తీసుకెళ్తుండగా కొందరు అభ్యంతరం చెప్పడమే కాకుండా ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ఈవో భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా అడ్డదారిలో దర్శనానికి తీసుకెళ్లినట్టు గుర్తించారు. అలాగే గతంలో హుండీ లెక్కింపు సందర్భంగా చోరీకి పాల్పడి చంద్రయ్య జైలుకు వెళ్లివచ్చినట్లుగా గుర్తించారు. ఈ మేరకు అడ్డదారిలో భక్తులను దర్శనానికి అనుమతించడంపై సస్పెండ్ చేశారు.

ప్రియుడ్ని కిడ్నాప్ చేయించింది!

● తిరుపతిలో కలకలం

● గంట వ్యవధిలోనే పట్టుకున్న పోలీసులు

తిరుపతి, (నేరవిభాగం), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తనను సరిగా చూడటం లేదని ప్రియురాలే ప్రియుడ్ని కిడ్నాప్ చేయించింది. ఈ ఘటన గురువారం తిరుపతిలో కలకలం రేపింది. గంట వ్యవధిలోనే పోలీసులు నిందితులు, బాధితుడిని పట్టుకోగలిగారు. తిరుపతి ఈస్ట్ సీఐ రామకృష్ణ తెలిపిన ప్రకారం.. చిత్తూరు జిల్లా పెనుమూరుకు చెందిన నాని తిరుపతి పెద్దకాపులేఅవుట్‌లో ఒక లాడ్జిని లీజుకు తీసుకున్నారు. ఇతడికి వివాహం కాలేదు. ఈ క్రమంలో మదనపల్లెకు చెందిన భాను.. భర్త చనిపోవడంతో తిరుపతికి వచ్చి చిన్నచిన్న పనులు చేసుకుంటున్నారు. ఈమె ఏడాది కిందట భానుకు పరిచయమైంది. వీరిద్దరూ కలిసి పెద్దకాపు లేఅవుట్‌లో ఉంటున్నారు. మూడు నెలలుగా తనను సరిగా పట్టించుకోక పోవడంతో ఆగ్రహించిన భాను.. మదనపల్లె నుంచి నలుగురు రౌడీలను రప్పించింది. లాడ్జిలో ఉన్న నానిని కిడ్నాప్ చేయించి మదనపల్లెకు తీసుకెళుతున్నారు. వాహనంలో అతడిని చిత్రహింసలకు గురిచేసినట్లు సమాచారం. కిడ్నాప్ సమాచారం తెలిసిన వెంటనే డీఎస్పీ వెంకటనారాయణ, సీఐ రామకృష్ణ, రక్షక్ బృందాలను ఎస్పీ సుబ్బరాయుడు అప్రమత్తం చేశారు. నాని మొబైల్ నెంబరు ఆధారంగా వాహనాన్ని గుర్తించారు. వాయల్పాడు వద్ద ప్రత్యేక బృందాలు వాహనం ఆపి కిడ్నాపర్లతో పాటు నానిని అదుపులోకి తీసుకుని తిరుపతికి తీసుకొస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో కిడ్నాపర్లను, బాధితుడ్ని విచారించి జరిగిన ఘటనపై దర్యాప్తు చేయనున్నారు.

బీసీల సంక్షేమానికి రూ.39వేల కోట్లు

● ఈ ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందన్న మంత్రి సవిత

తిరుపతి (కలెక్టరేట్), నవంబరు28 (ఆంధ్రజ్యోతి): బీసీల సంక్షేమానికి రూ.39వేల కోట్లను కేటాయించిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందని మంత్రి ఎస్.సవిత అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా గురువారం తిరుచానూరులోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు విద్యావంతులు కావాలనే ఉద్దేశంతో ఆ రోజుల్లోనే మహాత్మా జ్యోతి బాపూలే పోరాడారని ఆమె గుర్తు చేశారు. 70 నుంచి 80 శాతం పనులు పూర్తయిన బీసీ వసతి గృహాలు, రెసిడెన్షియల్ హాస్టళ్లను త్వరలో పూర్తి చేయనున్నామని తెలిపారు. బీసీలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. బీసీ స్టడీ సర్కిల్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణను ప్రారంభించామని, త్వరలో ఆన్‌లైన్ ద్వారా కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ, సాధికార అధికారి చంద్రశేఖర్, బీసీ సంక్షేమశాఖ అధికారులు, ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మంత్రి సవిత

మంచి రోజు చూసుకుని రండి

● కళంకిత కార్పొరేటర్లను పక్కన పెట్టండి

● టీడీఆర్ స్కాం, భూ కబ్జాలు, కూటమి నేతలపై దౌర్జన్యాలు చేసిన నేతలొద్దు

● ఇన్‌చార్జి మంత్రి అనగాని సూచన

తిరుపతి, నవంబరు28(ఆంధ్రజ్యోతి): కళంకిత కార్పొరేటర్లను పక్కన పెట్టి, తక్కినవారిని పార్టీలో చేర్చుకునేందుకు అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపినట్టు తెలిసింది. మంచి రోజు చూసుకుని పార్టీలో చేరేందుకు రావాలని సూచించినట్లు సమాచారం. మున్సిపల్ ఎన్నికల చట్ట సవరణ నేపథ్యంలో వైసీపీ కార్పొరేటర్లు కూటమి పార్టీలో చేరేందుకు బీసీ నేత అన్నా రామచంద్రయ్య, వైసీపీ సీనియర్ నేత దొడ్డారెడ్డి సిద్దారెడ్డి నేతృత్వంలో ఇటీవల 10 మందికి పైగా కార్పొరేటర్లు విజయవాడకు వెళ్లి ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసిన విషయం తెలిసిందే. తిరుపతికి వచ్చినప్పుడు పార్టీలోకి చేరేందుకు సన్నాహాలు చేసుకోమని మంత్రి చెప్పిన నేపథ్యంలో పలువురు కార్పొరేటర్లు ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా మంత్రి దిశానిర్దేశం చేసినట్టు సమాచారం. టీడీఆర్ బాండ్ల కుంభకోణం, భూకబ్జాలు, కూటమి నేతలపై దౌర్జన్యాలు చేసిన వైసీపీ నేతలను పార్టీలోకి తీసుకోవద్దని చెప్పినట్లు తెలియవచ్చింది. పార్టీ అధిష్ఠానం ఇప్పటికే పలువురు కార్పొరేటర్ల గురించి ఆరాతీసిందని, వారిపై సానుకూలమైన నివేదిక వచ్చిందన్న చర్చ జరిగినట్టు సమాచారం. అలాంటివాళ్లను పార్టీలోకి తీసుకునే ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పినట్టు తెలిసింది.



రామ్మూర్తి నాయుడి కర్మక్రియల్లో పాల్గొనేందుకు వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి - డిప్యూటీ స్పీకరు రఘురామకృష్ణరాజు - మాజీ ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ - నందమూరి మోహనకృష్ణ, రూప, నందమూరి సుహాసిని

నారావారిపల్లెలో ప్రముఖుల సందడి



సీఎం చంద్రబాబుతో టీటీడీ అదనపు ఈవో వెంకన్న చౌదరి - నారా చిన్నబ్బనాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చంద్రబాబు - సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.1,00116 చెక్కు అందజేస్తున్న రైతులు - మంత్రి లోకేశ్‌కు వినతుల అందజేత